2కే రన్‌ను నిర్వహిస్తున్న దృశ్యం

కల్వకుర్తిలో ఉత్సాహంగా 2కే రన్

పాల్గొన్న విద్యార్థులు, యువకులు, పట్టణ ప్రముఖులు

కల్వకుర్తి, మార్చి 9 ప్రభాతవార్త: ప్రజలందరూ తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని మున్సిపల్ చైర్మన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్, వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్, కమీషనర్ మహమూద్ షేక్‌లు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" 99 రోజుల ప్రత్యేక కార్యాచరణలో భాగంగా కల్వకుర్తి మున్సిపల్ కేంద్రంలో సోమవారం ఉదయం 2కే రన్ మున్సిపల్ కార్యాలయం నుండి మహబూబ్ నగర్ చౌరస్తా వరకు నిర్వహించిన 2కే రన్‌ను మున్సిపల్ చైర్మన్ బృంగి రత్నమాల,వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్, కమీషనర్ మహమూద్ షేక్‌లు ప్రారంభించారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమీషనర్ చైర్మన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పట్టణ ప్రగతే ధ్యేయంగా ఈ 99రోజుల కార్యాచరణను రూపొందించినట్లు తెలిపారు. ప్రతిరోజూ ఒక ప్రత్యేక అంశంపై (పారిశుధ్యం, ఆరోగ్యం -మిగతా4లో..

మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

పార్టీకి నిబద్ధతగా పనిచేసే వారికి మొదటి ప్రాధాన్యత

- కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం ఐక్యతగా పని చేద్దాం!
- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు శివసేనారెడ్డి

శ్రీరంగాపూర్,మార్చి9 ప్రభాతవార్త: సంస్థాగత బలోపేతానికి నాయకత్వ సామర్థ్యాల పెంపు బూతు స్థాయి నుండి పార్టీని పటిష్టం చేసి సముచిత స్థానం కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు శివసేనారెడ్డి అన్నారు.సోమవారం శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని మండల అధ్యక్షుల ఎన్నిక ప్రక్రియ కోసం ఏర్పాటు చేసిన సమావేశానికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి ఎమ్మెల్యే మెగా రెడ్డి తో కలిసి శివసేన రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు శివసేనరెడ్డి మాట్లాడుతూ పార్టీ పటిష్టత కోసం ఐక్యతగా పని చేద్దాం అని పిలుపునిచ్చారు.గతంలో ఉన్న మండల కమిటీలకు ప్రస్తుత నూతనంగా ఎన్నుకునే మండల కమిటీలకు వ్యత్యాసాలు చాలా ఉంటాయని కాంగ్రెస్ శ్రేణులకు సూచించారు. గ్రామాలలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో వెళ్లాలని సంస్థ గత గ్రామ కమిటీలు బూత్ కమిటీలో కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. పార్టీకి నిబద్ధతగా పనిచేసే వారికి మొదటి ప్రాధాన్యత ఉంటుందని కొత్తగా ఎన్నుకున్నమండల అధ్యక్షులు కార్యవర్గానికి కీలకంగా బాధ్యతగా పనిచేయాల్సి ఉంటుందన్నారు. శ్రీరంగపురం మండల కేంద్రంలో మండల అధ్యక్ష కార్యవర్గానికి పలువురు దరఖాస్తు చేసుకోగా వారి దరఖాస్తులను జిల్లా అధ్యక్షులు పరిశీలించి అధిష్టానం ఆదేశాల మేరకు నియామకం ఉంటుందని వెల్లడించారు. ఈ కార్యక్రమం లో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, ప్రమోదిని రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు రాములు పలువురు సర్పంచులు సీనియర్ నాయకులు, పలువురు పాల్గొన్నారు.

24వ డివిజన్‌లో ప్రగతి ప్రణాళిక

పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి

మహబూబ్‌నగర్, మార్చి9 ప్రభాతవార్త : 99 రోజుల కార్యక్రమం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా సోమవారం 24వ డివిజన్ లో పారిశుద్ధ్య పనులను మహబూబ్ నగర్ డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి పరిశీలించారు. డివిజన్ లోని సమస్యలను ప్రజలని అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి వాటిని త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో 24వ కార్పొరేటర్ బి.రాధ గోవర్ధన్‌గౌడ్, 48వ కార్పొరేటర్ కిషన్‌నాయక్, డివిజన్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 5కే రన్

స్టేడియం గ్రౌండ్ నుంచి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ వరకు.. పాల్గొన్న మేయర్, డిప్యూటీ మేయర్

ఉత్సాహంగా 5కే రన్‌లో పాల్గొన్న మేయర్, డిప్యూటీ మేయర్ తదితరులు

మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 9 ప్రభాతవార్త: 99 రోజుల కార్యక్రమం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన 5కే రన్ ఉత్సాహంగా సాగింది. సోమవారం ఉదయం 6:30 గంటలకు స్టేడియం గ్రౌండ్ నుంచి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ వరకు 5కే రన్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రామంజుల రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మహబూబ్ నగర్ కార్పొరేషన్ మేయర్ గుమల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు. పారిశుద్ధ్యం, ఆరోగ్యం పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావా లని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ బాధ్యత తో ఉండాలని సూచిం చారు. అనంతరం సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యులు నేటి యువతకి ఎంతో ఆదర్శంగానిలుస్తున్నారని సురేందర్‌రెడ్డి ఆకాంక్షించారు. అధికారులు ప్రజలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ అప్పయ్య,కార్పొరేషన్ కార్పొరేటర్లు,పోలీసు అధికారులు,అధికారులు, మున్సిపల్ సిబ్బంది, నాయకుల పాల్గొన్నారు.

ఆర్థికంగా ఎదిగినప్పుడే గౌరవం

పియూ పరీక్షల నియంత్రణ అధికారి డా. కె. ప్రవీణ

మహబూబ్‌నగర్, మార్చి 9 ప్రభాతవార్త : ప్రస్తుతము మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని, విద్య సాంఘిక, రాజకీయ, ఆర్థికంగా మహిళలు ఎదిగినప్పుడే మహిళలకు గౌరవం దక్కుతుందని పియూ పరీక్షల నియంత్రణ అధికారి డా. కె. ప్రవీణ అన్నారు. ఎగ్జామినేషన్ బ్రాంచ్‌లో మహిళాదినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పరీక్షల నియంత్రణ అధికారి డా. కె. ప్రవీణ, అదనపు పరీక్షల నియంత్రణ అధికారి డా. అనురాధ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా డా. కే. ప్రవీణ మాట్లాడుతూ ముఖ్యంగా మహిళలు చాలా సంవత్సరాలుగా చిన్నతనంలో తండ్రిపై, పెళ్లయిన తర్వాత భర్తపై వృద్ధాప్యంలో పిల్లలపై ఆధారపడటం జరుగుతుందన్నారు. అలా కాకుండా మహిళలు కూడా స్వతహాగా ఆలోచించడము తనకు తానుగా అభివృద్ధి వైపు ప్రయాణించి ఇతరులపై ఆధారపడకుండా ఉన్నత స్థాయిలోఉండడానికి ప్రయత్నించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు పరీక్షల నియంత్రణ అధికారి డా.అనురాధరెడ్డి, ఎగ్జామినేషన్ కోఆర్డినేటర్ డా. అరుంధతిరెడ్డి, మానస, స్వప్న, తారకేశ్వరి, ఉమా, రాగిణి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

గుట్టుగా రేషన్ దందా..!

- యథేచ్ఛగా చౌక ధర దుకాణాల నుంచే అక్రమంగా అమ్మకాలు
- ప్రతి డీలర్ షాపుల్లో నడుస్తున్న తతంగాల వెనుక అధికారుల మౌనమేలా...?
- మొదటి నుంచి సివిల్ సప్లై అధికారుల వైఫల్యాలు వార్తల్లో నిలుస్తున్న మారని తీరు...
- అసలు సూత్రధారులు ఎవరో...?

వనపర్తి, మార్చి 9 ప్రభాతవార్త: పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న సన్నబియ్యం దళారులకు ధనార్జన దందాగా మారింది. జిల్లాలోని వనపర్తి పట్టణం, ఘనపురం, కొత్తకోట, పెబ్బేర్, ఆత్మకూర్ తదితర ప్రాంతాల నుంచి పెద్ద మొత్తంలో రేషన్ బియ్యం క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. వ్యాపారులు గ్రామాలలో దళాలను ఏర్పాటు చేసుకుని బియ్యం సేకరిస్తూ దందా సాగిస్తున్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలో అయితే నేరుగా చౌక ధర దుకాణాలకు వచ్చి డీలర్లతో కుమ్మక్కై కొనుగోలు చేస్తు న్నారు. ఇట్టి విషయం సంబంధింత అధికారులకు తెలిసిన చూసి చూడ నట్లు వ్యవహరిస్తున్నారన్నా ఆరోపణలు బలంగా గుప్పిస్తున్నాయి.కొందరు వ్యాపారులు సిండికేట్‌గా మారి దంద కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది.సివిల్ సప్లై ఎన్‌ఫోర్స్ మెంట్ ఏం చేస్తున్నట్లు...??వ్యాపారుల ఏజెంట్లు గ్రామాల నుంచి స్వీకరించిన రేషన్ బియ్యాన్ని సంచుల్లో నింపి ద్విచక్ర వాహనాల్లో, ఆటోల్లో తీసుకొచ్చి ఆ ప్రాంతంలోని పాత ఇళ్లల్లో,గ్రామ శివారులో ఉన్న ఇళ్లల్లో నిల్వ చేస్తున్నారు. అదును చూసుకుని రాత్రి వేళల్లో బులెరో, డీసీఎం వాహనాలల్లోలోడ్ చేసి,జిల్లాలో ఉన్న బడ రైస్ మిల్లర్‌లు ప్రభుత్వానికి లక్షల్లో, కోట్లల్లో బకాయి ఉన్న, వారికి చేరవేస్తు న్నట్లు వినికిడి. నిత్యావసర సరుకుల అక్రమ రవాణా, రేషన్‌దుకాణాల తనిఖీలను పర్యవేక్షణ చేయాల్సిన సివిల్‌సప్లై ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారు లకు తెలిసి రేషన్ దందా నడుస్తున్నట్లు చర్చ నడుస్తోంది.

డీలర్ల కీలక పాత్ర...? : అక్రమ రేషన్ దందాలో డీలర్లు కీలకపాత్ర పోషిస్తున్నట్లు తెలుస్తోంది.డీలర్లు లబ్ధిదారులనుంచి వేలిముద్రలు తీసుకుని బియ్యానికి బదులుగా డబ్బులు ఇస్తున్నట్లు సమాచారం. తక్కువ ధరకు సుమారు 12 రూపాయలకు కొనుగోలు చేసిన బియ్యాన్ని రూ.25లకు దళారీ వ్యాపారం చేసే వారికి విక్రయిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. వనపర్తి జిల్లా కేంద్రంతో పాటు, వనపర్తి మండలంలో అన్ని గ్రామంలో బియ్యం వ్యాపా రాలు జోరుగా సాగుతున్నాయి. అన్ని తెలిసినా అధికారులు మాత్రం మౌనమేలా అన్నట్లుగా చూసి చూడనట్లు వ్యవహరిస్తు న్నారని బాహాటంగా గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇంత జరిగినా సివిల్ సప్లై ఎన్‌ఫోర్స్ మెంట్, అధికారులు, రెవెన్యూ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని అర్థమవుతుంది. వనపర్తి జిల్లాలో మొత్తం రేషన్ కార్డులు ఒక లక్ష 81 799, అందులో అంత్యోదయ 10,522, కార్డులు, అన్నపూర్ణ 108,ఫుడ్ సెక్యూరి టీకార్డులు ఒక లక్ష 71,169, మొత్తం 1,81,799, రేషన్‌కార్డులు కలవు ఒక నెలకు 3,874, మెట్రిక్ టన్నుల సన్న బియ్యం రేషన్ షాపులకు సరఫరా అవుతుంది, జిల్లాల మొత్తం రేషన్ షాపుల సంఖ్య 335.

జిల్లా పౌరసరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్ చరవాణిలో వివరణ కోరగా... జిల్లాలో ఉన్న చౌక ధర దుకాణాల నుండి అక్రమంగా రేషన్ దందా నడుస్తున్నట్లు మా దృష్టికి రాలేదు, మా దృష్టికి వస్తే అట్టిరేషన్ షాపుల లైసెన్స్‌లను రద్దుచేసి చట్టమైన చర్యలు తీసుకుంటాం ఇదివరకు అక్రమంగా రేషన్ బియ్యం దందా చేస్తున్న కొన్ని డీలర్ షాపుల పై చర్యలు తీసుకొని లైసెన్స్‌లు రద్దు చేసాం.

జిల్లా కేంద్రంలోని రేషన్ షాపు నుండి అక్రమంగా బయటకు తరలిస్తున్న రేషన్ బియ్యం

గణనాథుని రాతి విగ్రహం అపహరణ

బిజినేపల్లి, మార్చి 9 ప్రభాతవార్త: నంది వడ్డేమాన్ గ్రామంలో కాకతీయుల కాలం నాటి గణనాథుని రాతి విగ్రహం అపహరణకు గురైనట్లు గ్రామస్తులు తెలిపారు.12, 13 శతాబ్దాలలో నంది వడ్డేమాన్ గ్రామం పాత దేవాలయాలకు నిలయంగా ఉంది. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గౌరమ్మ గుడి దగ్గర బయట ఉన్న గణనాథుని రాతి విగ్రహాన్ని ఎత్తుకెళ్లారు. విగ్రహం ఉన్న దగ్గరికి వాహనం వచ్చినట్లు ఆనవాళ్లు కనిపించినట్లు గ్రామస్తులు వివరించారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుగుతున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

అపహరణకు గురైన కాకతీయుల కాలం నాటి గణనాథుని విగ్రహం

135 పాఠశాలల్లో 6000 మందికి పైగా విద్యార్థులు

మోటివేషనల్ సెషన్ వీక్షణ

నారాయణపేట, మార్చి 9 ప్రభాతవార్త : రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థుల కోసం నిర్వహించిన ప్రత్యేక మోటివేషనల్, గైడెన్స్ సెషన్ కార్యక్రమాన్ని నారాయణపేట జిల్లాలో విజయవంతంగా నిర్వహించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి డా. గోవిందరాజు తెలిపారు. జిల్లాలోని 135 పాఠశాలల్లో 6000 మందికి పైగా 10వ తరగతి విద్యార్థులు తమ ఉపాధ్యాయులతో కలిసి ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా మాట్లాడుతూ పరీక్షల సమయంలో విద్యార్థులు భయం, ఒత్తిడికి లోనవకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. సమయ పాలనతో చదువును ప్రణాళికాబద్ధంగా కొనసాగిస్తూ పాఠ్యాంశాలను తరచూ పునశ్చరణ చేసుకోవాలని తెలిపారు. డైరెక్టర్ నవీన్ నికోలస్ మాట్లాడుతూ అభ్యాస దీపికల వినియోగాన్ని మరింత సమర్థంగా అమలు చేయాలని సూచించారు. పరీక్షల మధ్యలో వచ్చే -మిగతా4లో..

ప్రత్యేక మోటివేషనల్, గైడెన్స్ సెషన్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న దృశ్యం

ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

- మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా
- ప్రజావాణిలో 119 దరఖాస్తులు స్వీకరణ

మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి9 ప్రభాతవార్త: ప్రజావాణికి ప్రజలు జిల్లాలోని సుదూర ప్రాంతాల నుండి ఎంతో నమ్మకంతో వారి సమస్యల పరిష్కారం కొరకు ఆశతో వస్తారని వారి ఫిర్యాదులను పరిశీలించి తగు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి 119 పిర్యాదులు స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లాకలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు పరిష్కరించడం అధికారుల బాధ్యత అని ఆమె పేర్కొన్నారు.ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తును అధికారులు జాగ్రత్తగా చదివి,అందులో పేర్కొన్న సమస్యలను పూర్తిగా అర్థం చేసుకుని, అవసరమైన విచారణ జరిపి సరైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అలా కాకుండా ఒక శాఖ నుండి మరొక శాఖకు అర్థం లేకుండా దరఖాస్తులను పంపించడం సరైన పద్ధతి కాదని ఆమె స్పష్టం చేశారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను నిర్ణీత కాలంలో పరిష్కరించి స్పష్టమైన నివేదిక సమర్పించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా మున్సిపాలిటీలు, పంచాయతీ రాజ్, అటవీ శాఖ, డీఆర్‌డీఏ, ప్రణాళిక శాఖ, గనుల శాఖ, భూ సేకరణ విభాగాలకు చెందిన అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై జిల్లా కలెక్టర్ వివరణ కోరారు. వచ్చే వారంలోపు అన్ని పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించి,గతవారం అందిన దరఖాస్తుల సంఖ్య, పరిష్కరించినవి,ఇంకా పెండింగ్‌లో ఉన్నవి వంటి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను స్పష్టమైన నమూనాలో సమర్పించాలని ఆదేశించారు. అనంతరం 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై అధి కారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్, గ్రామపంచాయతీ,మండల, మున్సి పాలిటీ, జిల్లా స్థాయిలో రోజువారీ షెడ్యూల్ ప్రకారం ప్రజలు, ప్రజా ప్రతి నిధులు కార్యక్రమాలను తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. ప్రతి రోజూ చేపట్టిన కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలు, వివరాలను కార్యక్రమం అనంతరం జిల్లా అధికారులవాట్సాప్ గ్రూపులో అప్లోడ్ చేయాలని, ఆదేశించారు.ఈ కార్యక్రమాన్ని జిల్లా స్థాయిలో నోడల్ అధికారిగా స్థానిక సంస్థల అదనపుకలెక్టర్ పర్యవేక్షిస్తారని, పంచాయతీ స్థాయిలో జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) పర్యవేక్షణ చేస్తారని తెలిపారు. నూతన జిల్లా కలెక్టర్‌ను జిల్లా సీనియర్ సిటిజన్ ఫోరంసభ్యులు జగపతిరావు,ఎం.బాలయ్య,అశోక్ కుమార్, నాగభూషణం, కోటిరెడ్డితదితరులు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియలను మర్యాద పూర్వకంగా కలుసుకుని పూలగుచ్చాలు అందజేసి శాలువా కప్పి సన్మానిం చారు.ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జెఎల్‌బి హరిప్రియ, జడ్‌పి సిఈఓ,ఇంచార్జి డిపిఓ వెంకట్‌రెడ్డి, డిఆర్‌డిఓ నర్సింహులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ కుష్బూ గుప్తా

గట్టు బ్లాక్‌ను అభివృద్ధి పరచడమే ధ్యేయం

- గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల మార్చి9, ప్రభాతవార్త: గట్టు బ్లాక్‌ను సమగ్రంగా అభివృద్ధి చేయడమే ధ్యేయంగా జోగులాంబ గద్వాల జిల్లా యంత్రాంగం కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.నీతి అయోగ్ ఆధ్వర్యంలో సోమవారం ఆంధ్ర ప్రదేశ్ లోని విశాఖపట్నంలో ఏ వన్ గ్రాండ్ కన్వెన్షన్ హాల్ లో రీజినల్ బెస్ట్ ప్రాక్టీస్ సెమినార్ ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన జోగులాంబ గద్వాల జిల్లా నుంచి ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్‌కు ఎంపికైన గట్టు మండలంలో విద్యా రంగంలో అమలు చేస్తున్న వినూత్న కార్యక్రమాలను సెమినార్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గట్టు మండలంలో గత కొన్ని సంవత్సరాలుగా విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉండేదని, విద్యా ప్రమాణాల లోపం వంటి సవాళ్లను జిల్లా పరిపాలన యంత్రాంగం గుర్తించి, వాటిని అధిగమించేందుకు సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెంపొందించేందుకు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపర్చేందుకు తీసుకుంటున్న పలు వినూత్న కార్యక్రమాలనుసెమినార్‌లో ప్రస్తావించారు.విద్యా రంగంలో చేపట్టిన చర్యలలో భాగంగా విద్యా వాలంటీర్ల నియామకం, సాయంత్రం ప్రత్యేక తరగతులు, విద్యార్థుల కోసం ప్రేరణాత్మక, అవగాహన కార్యక్రమాలు, తల్లిదండ్రులతో నిరంతర సమన్వయం సమావేశాలు, బడి మానేసిన విద్యార్థులను తిరిగి పాఠశాలల్లో చేర్చేందుకు ప్రత్యేక బృందాల ఏర్పాటు, అలాగే విద్యార్థుల్లో పోషకాహారలోపాన్ని అధిగమించేందుకు మధ్యాహ్న భోజనం తోపాటు ఉదయం కూడా పోషకాహారం అందించడం వంటి పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు వివరించారు.ఈ చర్యల ఫలితంగా గట్టు మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెరగడమే కాక పరీక్షలలో మంచి ఫలితాలను సాధించడం జరిగిందన్నారు.గట్టు మండలంలో రెండేళ్ల కిందట పదవ తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలు 76 శాతం ఉండగా ప్రస్తుతం 10 శాతం ఫలితాలు అదనంగా సాధిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. భవిష్యత్తులో 95శాతానికి పైగా ఫలితాలు సాధించడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు.ఈ సందర్భంగా జిల్లా పరిపాలన యంత్రాంగం, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, స్థానిక ప్రజాప్రతినిధుల సమిష్టి కృషి ఫలితంగా ఈ విజయాన్ని సాధించగలిగినట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.జోగులాంబ గద్వాల జిల్లా పరిపాలన యంత్రాంగం గట్టు బ్లాక్లో చేపట్టిన ఉత్తమ కార్యాచరణను అభినందిస్తూ నీతి అయోగ్ అదనపు కార్యదర్శి రోహిత్ కుమార్ ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్‌కు మెమెంటో అందజేశారు. అనంతరం నీతి ఆయోగ్ అదనపు కార్యదర్శి రోహిత్ కుమార్ మాట్లాడుతూ గట్టు బ్లాక్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దడానికి జోగులాంబ గద్వాల జిల్లా పరిపాలన యంత్రాంగం తీసుకుంటున్న సమగ్ర చర్యలు ఇతర జిల్లాలకు కూడా ఆదర్శంగా నిలుస్తాయని -మిగతా4లో..

నీతి అయోగ్ నుండి మెమెంటో అందుకుంటున్న కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్

ఫిర్యాదులను స్వీకరించిన అదనపు కలెక్టర్

- ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కారం చేయాలి
- గద్వాల జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు

గద్వాల మార్చి 9,ప్రభాతవార్త: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయములోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 96మంది తమ సమస్యల పరిష్కరం కోసం దరఖాస్తు చేసుకున్నారని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస రావు,వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో పిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ నర్సింగరావు

ఆత్మకూరులో సిపిఐ నిరసన

ఆత్మకూర్ మార్చి 09,ప్రభాతవార్త : మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో సోమవారం రోజు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో అమెరికా సామ్రాజ్యవాదం నశించాలంటూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా నాయకులు శ్రీ లక్ష్మీ నారాయణ శెట్టి మరియు శ్రీహరి తదితరులు మాట్లాడుతూ అమెరికా ఇజ్రాయిల్ కలిసి ఇరాన్ పై దురాక్రమనకు పాల్పడుతూ యుద్ధం చేయడం దుర్మార్గమని. అమెరికా ఇజ్రాయిల్ దేశాలు ప్రపంచవ్యాప్తంగా ఉన్నటువంటి చమురు నిలువలను స్వాధీన పరచుకునేందుకు చిన్న దేశాలపై యుద్ధోన్మాదం ప్రకటిస్తూ పేద ప్రజల ప్రాణాలను హరిస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధ మూలంగా ప్రపంచవ్యాప్తంగా పేదలకు సంబంధించిన అత్యవసర సరుకుల ధరలు పెరగడమే కాకుండా విద్యా మరియు వైద్యానికి పేదల దూరమయ్యే పరిస్థితిలో నెలకొంటాయని తద్వారా ఇరాన్ పై చేస్తున్న యుద్ధాన్ని నిలిపివేసేందుకు తక్షణమే కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం చొరవ చూపాలని వారు విజ్ఞప్తి చేశారు. ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలను కొనసాగిస్తూ నరహంతగా పాత్రను పోషిస్తున్న అమెరికా మరియు ఇజ్రాయిల్ దేశాలకు తగిన విధంగా బుద్ధి చెప్పేందుకు ప్రజాస్వామికవాదులు ముక్తకంఠంతో యుద్ధాన్ని నిలిపివేయాలంటూ ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు లక్ష్మీనారాయణ శెట్టి, మోష, నరసింహ శెట్టి, కాజాపీర్, బాలకృష్ణ తదితరులతో పాటుగా పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మకూరులో సిపిఐ నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మద్దూర్, మార్చి 9 ప్రభాతవార్త : మద్దూర్ మండలం మోమినాపూర్ గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని వివిధ వార్డుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. సేకరించిన చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గూళ్ల శ్రీదేవి రవికుమార్ మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచితేనే అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. మోమినాపూర్ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. ఇంటింటి చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా పంచాయతీ సూచించిన ప్రదేశాల్లో వేయాలని గ్రామస్తులను కోరారు. గ్రామ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, పంచాయతీ సెక్రెటరీ బాలరాజ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించిన అధికారులు

ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో ఆరోగ్య శిబిరం

మద్దూరు, మార్చి 9 ప్రభాతవార్త : మద్దూరు మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రత్యేక ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో మొత్తం 140 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్సలు అందించారు. గర్భాశయ క్యాన్సర్ సమస్యలు, దంత, ఎముకలు, పిల్లల ఆరోగ్య పరీక్షలు, కంటి సంబంధిత వ్యాధులకు చెందిన వైద్యులు రోగులను పరిశీలించి చికిత్సలు అందించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఇలాంటి శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ ఢిల్లీ కార్ సరస్వతి జనార్ధన్, వైస్ చైర్మన్ భాగ్యశ్రీ రెడ్డి, వార్డు కౌన్సిలర్లు బంగారు గోవిందు, మౌనిక ప్రకాష్, సంజీవులు, నారాయణమ్మ శామప్ప శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డా. పావని, డా. శ్రీలత, డా. విజయ్ కుమార్ రెడ్డి, డిపిఓ బిక్షపతి, నరేష్, వెంకటేష్, సూపర్‌వైజర్ హనుమంతు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు

ఉప్పునుంతల ఇంఛార్జి ఎంపిడిఓగా రేవతి రెడ్డి

ఉప్పునుంతల మార్చి 9 ప్రభాతవార్త : ఉప్పునుంతల మండల ఇంఛార్జి పరిషత్ అభివృద్ధి అధికారి గా సోమవారం రేవత్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన ఉప్పునుంతల ఎంపిడిఓ వరుణ్ తేజ వరుణ్ తేజ 45 రోజుల శిక్షణ నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లడంతో ఆయన స్థానంలో ఇంఛార్జి ఎంపిడిఓ గా రేవత్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో గ్రామాభివృద్ధికి కోసం పాటుపడాలని ఆయన కోరారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది ఇంఛార్జి ఎంపిడిఓ రేవతి రెడ్డిని శాలువాతో సన్మానించి ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సిబ్బందితో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. మండల అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని ఈ సందర్భంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రేవత్ రెడ్డి, పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ హెచ్ఎం జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి, నీలం శ్రీధర్, పంచాయతీ కార్యదర్శులు వెంకటేష్, అల్లాజీ, పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఓగా రేవత్ రెడ్డి

17,18న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కన్వెన్షన్

పోస్టర్ ఆవిష్కరించిన పాలమూరు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ శ్రీనివాస్

మహబూబ్‌నగర్, మార్చి 9 ప్రభాతవార్త : పాలమూరు విశ్వవిద్యాలయం 17, 18వ తేదీల్లో నిర్వహించే ఎస్ఎఫ్ఐ రాష్ట్ర యూనివర్సిటీల కన్వెన్షన్ సంప్రదించిన గోడ పత్రికలను పీయూ విసి జిఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ రమేష్ బాబు ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షులు జె పి ఎన్ సిఈ కళాశాల చైర్మన్ కేఎస్ రవికుమార్ అధ్యక్షుడు, డా. సుశ్రుత ప్రజా వైద్యశాల ఎండి డా. మధుసూదన్ రెడ్డి, చీఫ్ ప్యాట్రన్ మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెక్కం జనార్ధన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జరిగే ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కన్వెన్షన్‌కు పాలమూరు యూనివర్సిటీ వేదిక కావడం మంచి పరిణామం అని ఈ కన్వెన్షన్‌లో విశ్వవిద్యాలయాల విద్యార్థులకు మేలు చేకూరే అనేక రకాల చర్చలు చేయాలని తద్వారా విద్యారంగా పరిరక్షణకు అందరికీ విద్యా అందించే దానికోసం, విద్యార్థి హక్కుల కోసం ఎస్ఎఫ్ఐ కృషి చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ అధ్యక్ష కార్యదర్శులు బత్తిని రాము, రాజేష్ యాదవ్ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భరత్ ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ ఉపాధ్యక్షులు శేఖర్,సాయి అభినయ్, అనుష జయంతి అనూష,వర్షిక ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్ష కార్యదర్శులు జస్వంత్ రెడ్డి, మాణిక్ నాయకులు ఆదిత్య,సాయి పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

పారిశుద్ధ్య పనుల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి : ఇంఛార్జి ఎంపిడిఓ

ఉప్పునుంతల,మార్చి9 ప్రభాతవార్త : ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఇంఛార్జి ఎంపిడిఓ రేవత్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రమైన ఉప్పునుంతల పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉప్పునుంతల, పల్లె ప్రకృతి వనంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో చీపురు పట్టి పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగస్వాములుగా పనిచేశారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జి ఎంపీడీఓ రేవత్ రెడ్డి , పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు వెంకటేష్, అల్లాజీ పాఠశాల ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల్లో నిమగ్నమైన ఉపాధ్యాయులు

కాంగ్రెస్ నాయకుల మాటలు అర్ధ రహితం

నెట్టెంపాడు ప్రాజెక్టు పై మాట్లాడే అర్హత ఎమ్మెల్యేకు లేదు... బీజేపీ జిల్లా అధ్యక్షుడు టపాల రామాంజనేయులు...

గద్వాల మార్చి 09, ప్రభాతవార్త : జిల్లాలోని ప్రాజెక్టుపై మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుల మాటలు అర్థ రహితమని, అవగాహన లేని మాటలు మాట్లాడుతున్నారని, నెట్టెంపాడు ప్రాజెక్టు పై మాట్లాడే అర్హత ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి కి లేదని జిల్లా బీజేపీ అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. ఆనాడు పాదయాత్ర చేసి నెట్టెంపాడు ప్రాజెక్టుకు రెండు లక్షల ఎకరాలకు నీళ్లు అందించిన ఘనత డీకే అరుణమ్మది అని గుర్తు చేశారు. సోమవారం గద్వాల పట్టణంలోని డీకే బంగ్లాలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ...గత ఆదివారం హైదరాబాదులో జరిగిన జిల్లా సౌధ కార్యాలయంలో ఇరిగేషన్ ప్రాజెక్టుల రివ్యూ మీటింగ్‌లో డీకే అరుణమ్మ జూరాల ప్రాజెక్టు సేఫ్టీ కోసం బ్రిడ్జి కట్టాలని, ఆర్ అండ్‌బి బిడ్జి కూడా నిర్మాణం చేయాలని చెప్పడం జరిగింది. అవగాహన లేని కాంగ్రెస్ నాయకులు మంత్రి శ్రీహరి, మధుసూదన్‌రెడ్డి, కృష్ణమెహన్ రెడ్డిలు మహబూబ్నగర్ పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణమ్మ మాట్లాడిన మాటలను రాజకీయ లబ్ధి కోసం తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. పదేళ్ల పాలనలో నెట్టెంపాడు కాలువలో తట్టెడు మట్టికూడా తీయలేదని ఇద్దేవ చేశారు..పాదయాత్రతో నెట్టెంపాడు ప్రాజెక్టును సాధించి 2లక్షలఎకరాలకు నీరు అందించినఘనత డికె అరుణమ్మదన్నారు. రిజర్వాయర్లు పూర్తి చేయకుండా రిజర్వాయర్ల కెపాసిటీ పెంచుతామని ర్యాలంపాడు రిజర్వాయర్ నాలుగు టీఎంసీలు కూడా నిలవడం లేదని ఆరోపించారు. 10ఏండ్లు ఆయిన గట్టు లిఫ్ట్ పూర్తి చేయలేదని డికె. అరుణమ్మని విమర్శించే స్థాయి ఎమ్మెల్యేకు లేదన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కుమ్మరి శ్రీనివాసులు, శాలన్న, చంద్ర శేఖర్, మాజీ కౌన్సిలర్ బండల పాండు తదితరులు ఉన్నారు..

సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ అధ్యక్షుడు రామాంజనేయులు, బీజేపీ కౌన్సిలర్లు

ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేస్తే ఉద్యమాలు ఉధృతం చేస్తాం

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వనపర్తి జిల్లా అధ్యక్షులు అజయ్

అమరచింత మార్చి 9, ప్రభాతవార్త : ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేస్తే వ్యవసాయ కూలీలతో కలిసి ఉద్యమాలు ఉధృతం చేస్తామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు అజయ్ అన్నారు. సోమవారం అమరచింత మండలంలోని పామిరెడ్డి పల్లె గ్రామ ఉపాధి హామీ కూలీలను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అజయ్ మాట్లాడుతూ, గ్రామీణ ఉపాధి హామీ పథకానికి గతంలో కేంద్ర ప్రభుత్వం 90 శాతం రాష్ట్ర ప్రభుత్వం పదిశాతం నిధులు కేటాయించి ఉపాధి హామీ కూలీలకు నిధులు వచ్చేవని ఆయన అన్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ కూలీలకు కేంద్రం 60 శాతం భరించాలని కేంద్ర ప్రభుత్వం చెప్పడం విడ్డూరంగా ఉందని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే జీఎస్టీ వల్ల వచ్చే ఆదాయం రాష్ట్రాలకు కేటాయించకపోవడం వల్ల రాష్ట్రాల అభివృద్ధి కుంటుపడుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకానికి పేరు మార్చే ఆలోచనను విరమించుకోవాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ఉపాధి హామీ పని ప్రదేశంలో కూలీలకు ఓఆర్ఎస్ తో పాటు మంచినీటి సౌకర్యం కల్పించాలని, ఉపాదా హామీ కూలీల ఫోటో అప్డేట్ను నిబంధనలు ఎత్తివేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీల పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే అధికారులు పెండింగ్ బిల్లులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం అమరచింత మండల అధ్యక్షులు శంకర్, రైతు సంఘం నాయకులు మోహన్, బిల్లా, అనంతమ్మ, వెంకటన్న, కురువ మన్నెమ్మ, పెద్ద మల్లేష్, పెంటన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం అమలు చేయాలి

ఆత్మకూర్ మార్చి 9, ప్రభాతవార్త : దేశవ్యాప్తంగా వ్యవసాయ కార్మికులందరికీ సమగ్ర వేతన చట్టం అమలు చేయాలని అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం వనపర్తి జిల్లా అధ్యక్షులు ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. సోమవారం రోజు ఆత్మకూరు మండలంలోని బాలకృష్ణపూర్ మరియు ఖానాపూర్ గ్రామాలలో వ్యవసాయ కూలీల వద్దకు తమ సంఘం ఆధ్వర్యంలో వెళ్లి వ్యవసాయ కూలీల స్థితిగతులపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సమగ్ర చట్టంతో అమలు చేయాలని కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసేందుకు కుట్రలు పందుతుందని రాష్ట్ర ప్రభుత్వం సైతం వ్యవసాయ కూలీలకు 12,000 రూపాయల జీవన భృతి చెల్లిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని తక్షణమే నిలబెట్టుకునేందుకు చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు సమగ్ర వేతన చట్టం రూపొందించడమే కాకుండా ప్రతిరోజు వ్యవసాయ కూలీలకు 700 రూపాయల వేతనం చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని అంతేకాకుండా ఉపాధి హామీ చట్టంలో పనిచేసే కార్మికులకు కనీస వసతులు కల్పించే విధంగా కార్మిక శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు ఏడాది పొడవునా 200 రోజుల పని దినాలు కచ్చితంగా కల్పించాలని తద్వారా వ్యవసాయ కూలీల జీవన ప్రమాణాలు పెరిగేందుకు అవకాశం ఏర్పడుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెంకటన్న, రాములు తదితరులతో పాటుగా పలువురు పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీలను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రసాద్

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నల్ల బ్యాడ్జీలతో నిరసన

దామరగిద్ద, మార్చి 9 ప్రభాతవార్త: మండల విద్యా వనరుల కేంద్రం దామరగిద్దలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టీఎస్ యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న దశల వారీ పోరాటంలో భాగంగా సోమవారం ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీఎస్ యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు బాలాజీ మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు గత 15 నుండి 20 సంవత్సరాలుగా సేవలు అందిస్తున్నప్పటికీ తక్కువ జీతాలతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఎస్ఎస్ఏ మరియు కేజీబీవీ పరిధిలో పనిచేస్తున్న పీటీఐ , సీఆర్పీలు , ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, మెసెంజర్లు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నప్పటికీ సరైన వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడక ముందు ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కాలేదని విమర్శించారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు వెంటనే మినిమమ్ టైం స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పిఆర్టీయూ మండల నాయకులు ఉసెనప్ప మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగుల 29 రోజుల సమ్మె కాలానికి జీతాలు విడుదల చేయాలని కోరారు. ఉద్యోగులకు భద్రత కల్పించాలని కూడా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్షుడు వెంకట్ నాయక్, కార్యదర్శి రవికుమార్, పిఆర్టియు మండల నాయకులు ఉసెనప్ప, తపస్ మండల నాయకులు శంకర్ తదితరులు పాల్గొన్నారు. ఇతర ఉద్యోగ సంఘాలు కూడా ఈ నిరసనకు మద్దతు ప్రకటించాయి. మహిపాల్, నాగేందర్ , ఐఈఆర్పీ భాగ్యమ్మ, రమేష్ , వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న దృశ్యం

విద్యార్థులే ఉపాధ్యాయులై వేళ

గురువుల బాధ్యతలను, గౌరవాన్ని స్వయంగా తెలుసుకున్న ఉపాధ్యాయులైన విద్యార్థులు

మహిళ ఉపాధ్యాయులకు సన్మానం

శ్రీరంగాపూర్ , మార్చి 9 ప్రభాతవార్త : శ్రీరంగాపూర్ మండలంలోని కంబాలపురం ప్రాథమికోన్నత పాఠశాల నందు సోమవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించడం జరిగింది.

విద్యార్థులే ఉపాధ్యాయులై ...

వారికి కేటాయించిన పాఠ్యాంశాలను వివిధ తరగతులలో బోధనోపకరణాలను బోధన నైపుణ్యాలను ప్రదర్శిస్తూ పాఠ్యాంశాలను బోధించడం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా డి.ఐశ్వర్య, జిల్లా విద్యాధికారిగా ఎం.రిసీవర్ధన్, మండల విద్యాధికారిగా ద్రాక్షపల్లితో పాటు మొత్తం 19 మంది విద్యార్థులు ఉపాధ్యాయులై పాఠ్యాంశాలను బోధించారు. మంచిగా బోధన చేసిన ఉపాధ్యాయులకు ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులతో పాటు ఉపాధ్యాయులైన ప్రతి ఒక్కరికి బహుమతులను అందజేయడం జరిగింది.

ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు మాట్లాడుతూ ...

ఒక్క రోజు ఉపాధ్యాయులుగా మారి విద్యా బోధన చేసినందుకు గురువులకు ఉండే బాధ్యత గౌరవం ప్రత్యక్షంగా తెలుసుకున్నామని ఉపాధ్యాయులుగా అయినందుకు చాలా గర్వంగా ఆనందంగా ఉందని పేర్కొనడం జరిగింది.

స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

మహిళ ఉపాధ్యాయులకు సన్మానం...

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కంబాలపూరు ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న మహిళ ఉపాధ్యాయులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ పూలమాలలతో శాలువులతో ఘనంగా సన్మానించడం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ మహిళలను గౌరవించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, మహిళలు లేనిదే మనుషుల మనుగడా ఉండదని పేర్కొనడం జరిగింది. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మురళీధర్ రెడ్డి ఉపాధ్యాయులు వరలక్ష్మి, మాధవి, శివశంకర్ యాదవ్, సురేష్ బాబు, మాధవి లత, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంపై సర్పంచ్ ఆకస్మిక తనిఖీ

మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న సర్పంచ్

దామరగిద్ద, మార్చి 9 ప్రభాతవార్త : దామరగిద్ద మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం స్థానిక సర్పంచ్ అద్దన్ కనికిరెడ్డి మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యతను పరిశీలించి, పేద విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందించాల్సిందిగా వంట ఏజెన్సీ నిర్వాహకుడికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తన వంతుగా పూర్తిస్థాయి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ తనిఖీలో స్థానిక జిహెచ్ఎం కే. సురేష్, పాఠశాల మధ్యాహ్న భోజనం ఇంచార్జ్ శంభులింగం, రత్నం పాల్గొన్నారు.

అర్హులైన చేనేత కార్మికులకు ప్రభుత్వం రుణమాఫీ వర్తింప చేయాలి

అమరచింత చేనేత కార్మికులు వినతి పత్రం అందజేత

అమరచింత మార్చి 09,ప్రభాతవార్త : అర్హులైన చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ వర్తింపజేయాలని అమరచింత చేనేత కార్మికులు వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా చేనేత కార్మికులు మాట్లాడుతూ,అమరచింత పట్టణంలో 320 మంది చేనేత కార్మికులు చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నామని రాష్ట్రప్రభుత్వం నూట 164మంది చేనేత కార్మికులకు రుణ మాఫీ నిధులు కేటాయించారన్నారు. చేనేత కార్మికుకు ఒకే విడతలో రుణమాఫీ చేయాలని గద్వాల్ జోగులాంబ చేనేత సంచాలకుల గోవిందయ్యకు అనేకమార్లు వినతిపత్రం ఇచ్చిన ఫలితం లేదని ఇప్పటికైనా వనపర్తి జిల్లా కలెక్టర్ హారులైన ప్రతి చేనేత కార్మికునికి రుణమాఫీ వర్తింపచేయాలని వారు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో చేనేత కార్మికులు పాల్గొన్నారు.

సర్పంచులకు ఉపసర్పంచ్‌లకు వార్డు మెంబర్లకు శిక్షణ తరగతులు

వడ్డేపల్లి, మార్చి 9 ప్రభాతవార్త : వడ్డేపల్లి మండల పరిధిలోని శాంతినగర్ లో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మండలంలో గల అన్ని గ్రామాల సర్పంచులు వార్డు మెంబర్లకు శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణ తరగతులు ఐదు రోజులపాటు కొనసాగనున్నాయి.

ఫాగింగ్ మిషన్‌లు కొనుగోలు

కొనుగోలు చేసిన పాకింగ్ మిషన్ అందిస్తున్న దృశ్యం

చిన్న చింతకుంట, మార్చి 9 ప్రభాతవార్త : గ్రామాలలో దోమల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని దోమల నివారణకు గాను మండలంలోని ఐదు గ్రామాలకు ఐదు ఫాగింగ్ మిషన్లను కొనుగోలు చేసినట్లు ఎంపీడీవో లక్ష్మి నరసింహులు తెలిపారు. దమగ్నాపూర్, పర్దీపూర్, ఎదులాపూర్ ,మద్దూర్, కురుమూర్తి గ్రామాలకు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి ఈ ఫాగింగ్ మిషన్లను కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఒక్కొక్క ఫాగింగ్ మిషన్ రూ.53 వేలకు కొనుగోలు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ ఫాగింగ్ మిషన్‌లను ఆయా గ్రామాల సర్పంచులతోపాటు పంచాయతీ కార్యదర్శులకు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా..


శిథిలావస్థలో ఉన్న కల్వర్టు పనులకు శ్రీకారం చుట్టిన నాయకులు

నారాయణపేట, మార్చి 9 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమం భాగంగా నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల పరిధిలోని 23 గ్రామ పంచాయతీలలో కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇంచార్జ్ ఎంపీడీవో కొండన్న, ఆయా గ్రామాల సర్పంచ్‌ల ఆధ్వర్యంలో గ్రామస్థుల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా గ్రామాల్లో పార్టీలకతీతంగా వివిధ పార్టీల నాయకులు పాల్గొని అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఊట్కూర్ మండల కేంద్రంలో ఉపసర్పంచ్ రమేష్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఎం. భరత్, 14వ వార్డు సభ్యురాలు సువర్ణ, రవి, రవికుమార్ ఆధ్వర్యంలో పాతపేట ఆంజనేయస్వామి దేవాలయం వద్ద కొంతకాలంగా శిథిలావస్థలో ఉన్న కల్వర్టు పనులకు శ్రీకారం చుట్టారు. అదేవిధంగా పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్లాస్టిక్ వస్తువుల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

ఆర్థిక సహాయం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

శ్రీరంగాపూర్, మార్చి 9 ప్రభాతవార్త : శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన పెద్ద బీసన్న కూతురు పుష్పలత పాముకాటుతో శనివారం రాత్రి చనిపోవడం జరిగింది. ఈ విషయాన్ని శ్రీరంగాపూర్ మండలం వర్కింగ్ ప్రెసిడెంట్ రెడ్డి చర్ల శ్రీహరి ఎమ్మెల్యే మెగా రెడ్డికి తెలియజేయగా మృతురాలి కుటుంబానికి అండగా నేనున్నానంటూ వారి కుటుంబానికి ఆర్థిక సహాయంగా రూ. 5000లను కాంగ్రెస్‌నాయకులు సోమవారం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి కాంగ్రెస్ ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని తెలియజేస్తూ ఐదువేల రూపాయలను ఆర్థిక సహాయం గా అందించడం జరిగింది. మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీహరి రాజుతో పాటు వార్డ్ మెంబర్ నవీద్, శ్రీరంగాపూర్ ప్రెసిడెంట్ కుమ్మరి గోవిందు, రామచంద్రయ్య యాదవ్,విష్ణు ముదిరాజ్, టైలర్ అంజి, బహుజన రమేష్,అబ్దుల్ సమీర్, రాజ వర్ధన్, ల్యాబ్ సురేష్, రామరాజు, యాదగిరి, రవి, సంపత్ తదితరులు ఉన్నారు.

వెల్టూరు హైస్కూలో ఘనంగా వీడ్కోలు సమావేశం

వెల్టూర్ హైస్కూల్లో వీడ్కోలు సమావేశంలో ఉపాధ్యాయులు

ఉప్పునుంతల,మార్చి 9 ప్రభాతవార్త : మండలంలోని వెల్టూరు హైస్కూల్ లో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. టెన్త్ క్లాస్ విద్యార్థినీ విద్యార్థులకు వెల్టూరు గ్రామ పెద్దలు పూర్వ విద్యార్థి అర్జున్ రావు విద్యార్థులకు ప్యాడ్స్ పెన్నులు కంబాక్స్‌లు విద్యార్థులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు,సీనియర్ ఉపాధ్యాయులు రవిశేఖర్, జంగయ్య ,సురేందర్, వెంకటయ్య,రాజేందర్, తయ్యబల్లి,చంద్రశేఖర్, క్రాఫ్ట్ జ్యోతి,సిఆర్పి శ్రీను,విద్యార్థి తల్లిదండ్రులు ,గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు అర్జున్ రావు మాట్లాడుతూ భవిష్యత్తులో పాఠశాలలో మంచి పేరు తీసుకురావాలని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. అదేవిధంగా సాంస్కృతిక కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించడం జరిగిందని 9వ తరగతి ఇంఛార్జి జంగయ్య , వ్యాయామ ఉపాధ్యాయుడు రమేష్ తెలిపారు.

నూతన వార్డు సభ్యులకు శిక్షణ శిబిరం ఏర్పాటు

నూతన వార్డు సభ్యులకు శిక్షణ శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీరంగాపూర్,మార్చు 9 ప్రభాతవార్త : శ్రీరంగాపూర్ మండలకేంద్రంలో సోమవారం నూతనంగా ఎన్నికైన గ్రామ పంచాయతీ వార్డు సభ్యులకు సోమవారం నుండి శుక్రవారం వరకు నాలుగు రోజులపాటు శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని ఎంఆర్సి భవనం నందు శిక్షణ శిబిరము ఏర్పాటు చేయడం జరిగింది. ఈ శిక్షణ శిబిరం నందు వార్డు సభ్యులకు గ్రామపంచాయతీ పరిపాలన పైన పూర్తిగా అవగాహన కలిగించడం జరుగుతుందని వార్డు సభ్యులు తమ అధికారాలను విధులను తెలుసుకొని గ్రామాలను అభివృద్ధి చేయడంలో కీలకపాత్ర పోషించడం జరుగుతుందని కనుక నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులు ఈ శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవి నారాయణ, ఎంపీఓ రాజు, గ్రామ సర్పంచ్ మద్దిలేటి, అధికారులు తదితరులు పాల్గొనడం జరిగింది.

నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి కల్పనలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణ

నారాయణపేట, మార్చి 9 ప్రభాతవార్త : నిరుద్యోగులకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణ విమర్శించారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయడంలో నిరక్ష్యం వహిస్తున్నాయని, జాబ్ క్యాలెండర్ కూడా అమలు చేయలేకపోయాయని ఆరోపించారు.నిరుద్యోగ భృతి అమలు కాకపోవడం వల్ల యువత తీవ్ర నిరాశకు గురవుతున్నారని అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం 1.90 లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఇచ్చిన హామీని ఇప్పటివరకు అమలు చేయలేదని విమర్శించారు. అలాగే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అమలు చేయలేదని పేర్కొన్నారు తక్షణమే ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేసి నిరుద్యోగ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పీవైఎల్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్దు, సహాయ కార్యదర్శి మధు, నాయకులు రవి, కృష్ణ, శివ, గణేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 14 ఫిర్యాదులు

ఫిర్యాదులు స్వీకరిస్తున్న
జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫణింధర్ రెడ్డి

నారాయణపేట,మార్చి 9 ప్రభాతవార్త : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ప్రజల ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫణింధర్ రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణి సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా మొత్తం 14 ఫిర్యాదులు అధికారులకు అందాయి. ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదును జాగ్రత్తగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా సంబంధిత శాఖలు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీను, ఆర్డీవో రామచందర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా 5కె రన్

రాలీగా వెళుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ జయలక్ష్మి,
కౌన్సిలర్లు మున్సిపల్ అధికారులు

గద్వాల మార్చి 9,ప్రభాతవార్త : ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక వైయస్సార్ చౌరస్తా నుండి గద్వాల్ పట్టణ పుర ప్రముఖ వీధుల గుండా 5కె రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ జయలక్ష్మి మాట్లాడుతూ, గద్వాల పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకునేందుకు పట్టణ ప్రజలు ప్రతిరోజు చెత్త సేకరణకు వచ్చే మున్సిపల్ సిబ్బందికి తడి పొడి చెత్తను వేరు చేసి అందజేయాలన్నారు.పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని,చెత్తను రోడ్లపై పడేయకూడదని అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నారు.యువత చెడు వ్యసనాలకు గురికాకుండా ప్రతిరోజు శారీరక వ్యాయామం చేస్తూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్, మున్సిపల్ కమిషనర్ జానకిరామ్ సాగర్ , డివైయస్ఓ కృష్ణ, మున్సిపల్ సిబ్బంది, వివిధ పాఠశాల కళాశాలల క్రీడాకారులు, క్రీడా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం : కలెక్టర్ ఖుష్బూ గుప్తా

పదోతరగతి విద్యార్థినులకు సూచనలిస్తున్న కలెక్టర్

వంటశాలలో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న కలెక్టర్

పరిశుభ్రతా కార్యక్రమాలను పరిశీలిస్తున్న కలెక్టర్ కుష్బూ గుప్తా

భూత్పూర్,మార్చి 9,ప్రభాతవార్త : పరిసరాల పరిశుభ్రతతోనే మంచి ఆరోగ్యం సాధ్యమని మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా అన్నారు.పరిసరాలు శుభ్రంగా ఉంటేనే మన ఆరోగ్యాలు బాగుపడతాయని పేర్కొన్నారు.ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక పనుల పేరిట సోమవారం భూత్పూర్ పట్టణ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణ శివారులోని కేజీబీవీ పాఠశాలలో నిర్వహించిన పరిశుభ్రతా కార్యక్రమాలను కలెక్టర్ కుష్బూ గుప్తా పరిశీలించారు.పాఠశాల తరగతి గదులు,వంటశాల,ఆవరణను కలెక్టర్ పరిశీలించారు.పదో తరగతికి వెళ్లి విద్యార్థినులతో మాట్లాడారు.ఈ సందర్భంగా కలెక్టర్ పదో తరగతి విద్యార్థినులతో ముచ్చటిస్తూ పరీక్షల్లో బాగా చదివి ఆందోళన పడకుండా నిర్భయంగా రాయాలని,టీచర్లు విద్యార్థినులకు ఆయా సబ్జెక్టులలో అనుమానాలు,అర్థంకాని విషయాల్ని నివృతి చేయాలని సూచించారు.విద్యార్థినులకు స్పెషల్ క్లాసులు తీసుకుని మంచి మార్కులు సాధించేందుకు కృషిచేయాలని ఉపాధ్యాయుల్ని ఆదేశించారు.విద్యార్థినులకు ఎప్పటికప్పుడు హెల్త్ చెకప్ చేసి వారిని ఆరోగ్యంగా తీర్చిదిద్దాలని కేజీబీవీ స్పెషలాఫీసర్‌ను కలెక్టర్ ఆదేశించారు.వంట చేసే కుక్‌లు ఆరోగ్య నియమాలు పాటించి జాగ్రత్తలతో వంట చేయాలని సూచించారు.అధికారులు విద్యార్థినులకు నాణ్యమైన భోజనాన్ని అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.మరుగుదొడ్లు,మూత్రశాలలు ఎప్పటికప్పుడు శుభ్రపర్చే విధంగా చర్యలు తీసుకోవాలని కేజీబీవీ సిబ్బంధిని ఆదేశించారు. రాష్ట్రీయ బాల్ స్వస్థ్ కార్యక్రమం ద్వారా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు.రోజుకు ఎంతమంది విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారని స్పెషల్ ఆఫీసర్‌ను అడుగగా, పాఠశాలలో మొత్తం 270మంది విద్యార్థినులున్నారని,రోజుకు 70మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని స్పెషలాఫీసర్ కలెక్టర్‌కు వివరించారు.విద్యార్థినులలో హెమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉంటే నీరసం వస్తుందని,వీరికి పౌష్టికాహారం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి చంద్రశేఖర్‌రావు,స్వచ్ఛ సర్వేచ్ఛన్ ఇంచార్జీ శివప్రసాద్,మున్సిపాలిటీ సూపరిన్‌టెన్‌డెంట్ నర్సింహులు,కేజీబీవీ స్పెషలాఫీసర్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

కౌకుంట్లలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని మంత్రిని కోరిన ఎమ్మెల్యే

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడిని మర్యాదపూర్వకంగా కలిసిన దేవరకద్ర ఎమ్మెల్యే

వ్యవసాయ శాఖామంత్రితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

దేవరకద్ర,మార్చి 9 ప్రభాతవార్త: కౌకుంట్ల మండల కేంద్రంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుని కోరారు. అదేవిధంగా నియోజకవర్గంలో కొత్తగా 7 పిఎసిఎస్ లు ఏర్పాటు చేయాలని, పేరూరు, చౌదర్పల్లి, గ్రామాలలో కొత్తగా ఏఈఓ క్లస్టర్లను ఏర్పాటు చేయాలని,దేవరకద్ర, కొత్తకోట, మున్సిపాలిటీ కేంద్రాలలో ఏడిఈ ఆఫీసులను మంజూరు చేయాలని వ్యవసాయ మంత్రిని దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ కోరారు. అనంతరం రాజ్యసభకు ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు ఎం. నరేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. తదనంతరం రాష్ట్ర ప్రయోజనాలను ప్రజల ఆకాంక్షలను పెద్దల సభలో సమర్థవంతంగా వినిపిస్తూ, తన అపార అనుభవంతో దేశాభివృద్ధిలో వారు కీలకపాత్ర పోషించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను, అని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి తెలియజేశారు. కార్యక్రమంలో టిపిసిసి ఆర్గనైజింగ్ సెక్రెటరీ అరవింద్ కుమార్ రెడ్డి, కౌకుంట్ల మండల అధ్యక్షులు ఎం రాఘవేందర్ రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే సోదరుడు భాస్కర్ రెడ్డి, భూత్పూర్ మున్సిపాలిటీ చైర్మన్ బాలకోటి తదితరులు పాల్గొన్నారు.

సమ్మె కాలపు వేతనాన్ని వెంటనే చెల్లించాలని నల్ల బ్యాడ్జీలతో నిరసన

నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న సిబ్బంది

చిన్న చింతకుంట,మార్చి 9 ప్రభాతవార్త : మండల విద్యా వనరుల కేంద్రంలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు సోమవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు పే స్కేల్ వేతనాలు చెల్లించడంతో పాటు గత సంవత్సరం 29 రోజుల సమ్మె కాలపు వేతనాన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మండల వనరుల కేంద్రం మరియు కస్తూర్బా గాంధీ సిబ్బంది ఈ నిరసనలో పాల్గొన్నారు. గతంలో పిసిసి అధ్యక్షుడిగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమగ్ర శిక్షణ ఉద్యోగుల సమస్యలు చాయ్ తాగే లోపల పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికి హామీ నెరవేరలేదని సమగ్ర శిక్ష ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ హామీలను నెరవేర్చాలని గత సంవత్సరం సమ్మె చెయ్యగా మీ డిమాండ్లను పరిష్కరిస్తామని డిప్యూటీ ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క హామీ ఇచ్చినా ఇప్పటివరకు నెరవేర్చలేదన్నారు. గత సంవత్సరం సమ్మె కాలపు 29 రోజుల కు సంబంధించిన వేతనాలు ఇప్పటివరకు చెల్లించకపోవడం అన్యాయమని వెంటనే ప్రభుత్వం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు .ఈ నిరసన కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ హేమలత, సి ఆర్ టి లు రాజేశ్వరి, లక్ష్మీదేవి ,పిఈటి మమత, ఎంఐఎస్ కోఆర్డినేటర్ కవిత ,డేటా ఎంట్రీ ఆఫీసర్ మజాహర్ అలీ, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ విజయ్ సింహ, ప్రవీణ్ కుమార్, ఐఈఆర్ ప్రసన్నకుమారి, మెసెంజర్ రాజు, పార్ట్ టైం ఇన్ స్పెక్టర్ నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీతో నీటి సరఫరా నిలిపివేత

నారాయణపేట, మార్చి 9 ప్రభాతవార్త : నారాయణ పేట జిల్లా మరికల్ సమీపంలోని మన్యంకొండ నారాయణపేట మార్గంలో ఉన్న మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్‌లో పెద్ద లీకేజీ సంభవించిన కారణంగా నీటి సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు మార్చి 9 సాయంత్రం 6 గంటల నుంచి మార్చి 11 ఉదయం 6 గంటల వరకు మొత్తం 36 గంటలపాటు నీటి సరఫరా నిలిపివేయబడుతుంది. దెబ్బతిన్న పైప్‌లైన్ భాగాన్ని తొలగించి కొత్త పైపుతో భర్తీ చేసే పనులు చేపట్టనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. మన్యంకొండ నీటి శుద్ధి కర్మాగారం నుండి నీటి సరఫరా పొందుతున్న దేవరకద్ర, నారాయణపేట, మక్తల్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని పలు మండలాలు ఈ షట్‌డౌన్ ప్రభావానికి లోనవుతాయి దేవరకద్ర, నర్వా, మరికల్, ఉట్కూర్, నారాయణపేట, దామర్‌గిద్ద మండలాలు పూర్తిగా ప్రభావితమవుతాయి. అలాగే కౌకుంట్ల, చిన్నచింతకుంట, మక్తల్, దన్వాడ మండలాలు పాక్షికంగా ప్రభావితమవుతాయని తెలిపారు. మక్తల్, దేవరకద్ర, నారాయణపేట మున్సిపాలిటీలతో పాటు మొత్తం 245 గ్రామాలు ఈ నీటి సరఫరా అంతరాయం ప్రభావానికి లోనవుతాయి. అందువల్ల ప్రజలు ముందస్తుగా తాగునీటిని నిల్వ చేసుకొని సహకరించాలని మిషన్ భగీరథ గ్రిడ్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి. శ్రీనివాస్ కోరారు.

బీఆర్ఎస్ నేత కుమారుడి రిసెప్షన్‌కు హాజరైన మాజీ మంత్రులు

రిసెప్షన్‌కు హాజరైన మాజీ మంత్రులు,మాజీ ఎమ్మెల్యే తదితరులు

భూత్పూర్,మార్చి 9,ప్రభాతవార్త : బీఆర్ఎస్ భూత్పూర్ మండల సీనియర్ నాయకుడు టి మురళిధర్‌గౌడ్ కుమారుడైన రోహిత్‌గౌడ్ వివాహం ఈ నెల 6న హైదరాబాద్‌లో జరుగగా,ఆదివారం రాత్రి వైట్‌హౌస్ కన్వెన్షన్‌లో రిసెప్షన్ జరిగింది.ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.రిసెప్షన్‌కు మాజీ మంత్రులు డాక్టర్ లక్ష్మారెడ్డి,నిరంజన్‌రెడ్డి,శ్రీనివాస్‌గౌడ్‌లతో పాటు మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి,మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్,కాటం ప్రదీప్‌కు మార్‌గౌడ్,మాజీ మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్‌లతో పాటు మాజీ ముడా డైరెక్టర్లు సత్తూర్ చంద్రశేఖర్ గౌడ్,మూష సాయిలు,జిల్లా మత్స్యసహకార సంఘం మాజీ చైర్మన్ మనెమోని సత్యనారాయణ,మాజీ సింగిల్ విండో చైర్మన్ కదిరే అశోక్‌రెడ్డితో పాటు మండల నాయకులు సత్తూర్ నారాయణగౌడ్,మేకల సత్యనారాయణ,తూము శ్రీనివాస్‌రెడ్డి,భూత్పూర్ మున్సిపల్ నాల్గోవార్డు కౌన్సిలర్ గడ్డం ప్రేమ్‌కుమార్,మాజీ సింగిల్ విండో డైరెక్టర్ గడ్డం రాములు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి...

సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి రవి కుమార్

గద్వాల మార్చి 09, ప్రభాత వార్త : ఈనెల 28న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ లో రాజీ కాదగిన వీలైనన్ని ఎక్కువ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని మొదటి అదనపు ప్రధాన న్యాయమూర్తి ఎస్.రవికుమార్ పేర్కొన్నారు. సోమవారం గద్వాల కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహణపై పోలీసు అధికారులతో న్యాయమూర్తి సమావేశమయ్యారు. ఠాణాలు, కోర్టుల చుట్టూ కక్షిదారులు తిరగకుండా ఇరు వర్గాలను సమన్యయపరిచి క్రిమినల్ కేసుల రాజీ విషయమై వారిలో అవగాహన కల్పించాలన్నారు. ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యేలా కృషి చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. రాజీ మార్గమే రాజామార్గమని కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరిగి డబ్బు సమయం వృధా కాకుండా రాజీద్వారా కేసులు పరిష్కరించేందుకు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు సీనియర్ సివిల్ జడ్జి టి లక్ష్మి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ ఎ. వి.హెచ్ పూజిత, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి డి.ఉదయ నాయక్, అడిషనల్ ఎస్పీ శంకర్, ఏపిపి భవాని, ఆయా స్టేషన్లో ఎస్ఐలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

గ్రామ సర్పంచ్ శశికళ ప్రవీణ్

పల్లె ప్రకృతి వనంలో పిచ్చి మొక్కలు తొలగిస్తున్న దృశ్యం

కోయిలకొండ మార్చి 09,ప్రభాతవార్త : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోయిలకొండ మండలంలోని లింగాల చేడు గ్రామ సర్పంచ్ శశికళ ప్రవీణ్ అన్నారు. సోమవారం మండల అభివృద్ధి అధికారి ధనుంజయ గౌడ్ ఆదేశాల మేరకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని పల్లె ప్రకృతి వనంలో పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. పల్లె పకృతి వనములో పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ శశికళ ప్రవీణ్ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రత గ్రామంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సూచించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎలాంటి రోగాలు దరిచేరవని సర్పంచ్ సూచించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఐడి కార్డుల పంపిణీ

విద్యార్థులకు ఐడి కార్డులు పంపిణీ చేస్తున్న సర్పంచ్

బిజినేపల్లి, మార్చి 9 ప్రభాతవార్త: ప్రాథమికోన్నత పాఠశాల కారుకొండ పాఠశాల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సిబ్బందికి సర్పంచ్ ఉమారాణి శేఖర్ రావు సోమవారం ఉచితంగా ఐడి కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఉమారాణి శేఖర్ రావు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు టై,బెల్టు ఐడి కార్డు ఇవ్వడం జరిగిందని విద్యార్థులు కష్టపడి బాగా చదివి గొప్పవాళ్లు కావాలని సూచించారు.ఈ కార్య క్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న గద్వాల బీజేపీ నాయకులు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి తో గద్వాల బీజేపీ నాయకులు

గద్వాల,మార్చి 09,ప్రభాతవార్త: హైదరాబాద్ లో బీజేపీ రాష్ట్ర కార్యాలయం ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో జోగులాంబ గద్వాల జిల్లా బీజేపీ నాయకులు పాల్గొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు తో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర నాయకులు సంగాల అయ్యపురెడ్డి,వీరితోపాటు బీజేపీ వనపర్తి జిల్లా మాజీ అధ్యక్షులు ఎద్దుల రాజవర్ధన్ రెడ్డి, జోగులాంబ గద్వాల జిల్లా మాజీ అధ్యక్షులు యస్.రామచంద్రా రెడ్డి , బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బండల వెంకట్రాములు, జోగులాంబ గద్వాల జిల్లా బీజేవైయం అధ్యక్షులు మీర్జాపురం వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు పోలీస్ స్టేషనుకు తరలింపు

అక్రమంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు

ఖిల్లా గణపురం మార్చి 9, ప్రభాతవార్త: మండల పరిధిలోని ఆముదం బండ తండా గ్రామపంచాయతీ పరిధిలో సోమవారం అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని సమాచారం మేరకు అక్కడికి వెళ్లి పరిశీలించగా ఎలాంటి అనుమతులు లేకుండా మూడు ట్రాక్టర్లు మట్టిని తరలిస్తున్నట్లు గుర్తించామని వాటిని పోలీస్ స్టేషన్కు తరలించి తదుపరి చర్యలు తీసుకోవడానికి జిల్లా ఎడి మైన్స్ వనపర్తి అధికారికి తగు చర్యల నిమిత్తం సమాచారం పంపించామని ఎస్సై వెంకటేష్ తెలిపారు.

బైక్ ఢీకొనడంతో వ్యక్తి మృతి

- బాధితుల వద్దకే వెళ్లి ఎఫ్ఐఆర్ నమోదు - సిఐ శివ శంకర్

బాధితుల వద్దకే వెళ్లి ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీస్ సిబ్బంది

నారాయణపేట, మార్చి9 ప్రభాతవార్త: నారాయణపేట మండలంలో షేర్న పల్లి గ్రామానికి చెందిన గోవిందోళ్ల నర్సింగప్ప (47) కూలీ పనుల కోసం కొల్లంపల్లి వెళ్లి తిరిగి వస్తుండగా బైక్ ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన భాగంగా ఆదివారం సాయంత్రం కొల్లంపల్లి స్టేజి సమీపం లోని వడెప్ప అన్నపూర్ణ రైస్ మిల్ వద్ద రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా నారాయణపేట నుండి వచ్చిన స్ప్లెండర్ ప్లస్ బైక్ అతివేగంగా వచ్చి వెనుక నుండి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నర్సింగప్ప తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. మొదటనారాయణపేట ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా సోమవారం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందారు. బైక్ నడిపిన వ్యక్తి నారాయణపేటకు చెందిన శ్రీనుగా గుర్తించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు సమాచారం అందుకున్న సర్కిల్ ఇన్స్పెక్టర్ శివశంకర్, రూరల్ ఎస్సై రాముడు సంఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు స్వీకరించి అక్కడికక్కడే ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కేసును బిఎన్ఎస్ చట్టం కింద నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు రాలేని పరిస్థితిలో ఉన్న బాధితుల వద్దకే వెళ్లి ఎఫ్ఐఆర్ నమోదు చేసి న్యాయం జరిగేలా చర్యలు తీసుకున్నామని పోలీసులు పేర్కొన్నారు.

మహిళలకు ఘన సన్మానం

మహిళలను సన్మానించిన దృశ్యం

మక్తల్ టౌన్, మార్చి 9 ప్రభాతవార్త: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని తేదీ మార్చ్ 9న మక్తల్ మండల మహిళా సమాఖ్యలో సమాచార హక్కు చట్టం 2005,జి నారాయణ ఆర్టిఐ నారాయణపేట జిల్లా అధ్యక్షులు ఆధ్వర్యంలో జి. కవిత ఆర్టిఐ మండల మహిళా కన్వీనర్ అధ్యక్షతన మహిళలను గౌరవించుకోవడం జరిగినది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గౌరవ వాకిటి మానస మక్తల్ మున్సిపల్ ఛైర్మన్ హాజరై మహిళలు విద్య, ఉద్యోగం, స్వయం ఉపాధి, ఆరోగ్యం, సమాజం లో గౌరవం పొందినప్పుడే కార్యక్రమానికి సర్థకత ఉంటుందన్నారు. కార్యక్రమములో ఓఎంఐఎఫ్ బాద్యులు పాల్గొని మహిళలను పాటలతో చైతన్యం వచ్చిందని రాష్ట్ర బాద్యురాలు హాజమ్మ వారి కమిటి సభ్యులు గంధం మాధవి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి రమేష్ సిడిపిఓ సరోజినీదేవి, మగనూర్ ఆర్‌టిఐ మండలాధ్యక్షులు బలరాం, బాలరాజ్,రాజేశ్వరి, ఆర్‌పి వారి టీం, డీ.సునీత అలాగేసంతోషి న్యాయవదులు మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

విజేతలకు బహుమతులు అందజేసిన దృశ్యం

మక్తల్ టౌన్, మార్చి 9 ప్రభాతవార్త: టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు బి.గోపాలం, ప్రధాన కార్యదర్శి బి. దీప ఆధ్వర్యంలో ఈ నెల 8న సాయి జ్యోతి ఉన్నత పాఠశాల మక్తల్‌లో మహిళలకు, ఓపెన్ టు ఆల్ టగ్ ఆఫ్ వార్ నిర్వహించిన పోటీలలో 14 జట్లు పాల్గొనగా, ఉత్సాహంగా హోరాహోరీగా సాగిన పోటీలలో ప్రథమ స్థానం శిశు మందిర్ పాఠశాల బాలికలు, ద్వితీయ స్థానం మహిళా పిఈటిలు, తృతీయ స్థానంకర్ని పాఠశాల బాలికలు గెలుపొందారు. జిల్లా అధ్యక్షుడు బి.గోపాలం, జిల్లా కార్యదర్శి బి. దీప నగదు బహుమతి, మెమొంటోస్, మెడల్స్ ను అందజేసి వారిని అభినందించారు. బి.గోపాలం మాట్లాడుతూ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలను ప్రోత్సహించి, గౌరవించాలని ఈ క్రీడలను రూ.30,000 వేల సొంత ఖర్చులతో నిర్వహించామని ఆయన తెలిపారు.ఈ తాడు లాగుడు పోటీల కార్యక్రమంలో పీడీలు బీ.రూప, మీనా కుమారి, బి.శిల్ప, పుష్ప, అనిత, స్వప్న, అవంతి, చంద్రకళ, శ్రీనివాసులు, చరణ్, సంతోష ,అనూష , 150 మంది మహిళలు బాలికలు పాల్గొన్నారు.

డిజిటల్ క్రాప్ సర్వేను త్వరగా పూర్తి చేయాలి

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప

కొంకల గ్రామాన్ని సందర్శించిన జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప

వడ్డేపల్లి, మార్చి9 ప్రభాతవార్త: సోమవారం నాడు జిల్లా వ్యవసాయ అధికారి వీరప్ప వడ్డేపల్లి మండలంలోని డిజిటల్ క్రాఫ్ట్ సర్వే (సాంకేతిక పంట నమోదు) కొంకల గ్రామంలో సందర్శించారు. వడ్డేపల్లి మండలంలో 9 గ్రామాలలోవాలంటరీల చేత డిజిటల్ క్రాప్ నమోదు చేయబడుతుంది. గ్రామాన్ని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప సందర్శించి త్వరగా పూర్తి చేయాలని తెలిపారు.అలాగే మండలంలోని ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేసి డీలర్లకు ఎమ్మార్పీ రేటుకేఅమ్మకాలు జరపాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి ఏ.రాధ, ఏఈఓలు కె. విమల, బి.రామ నాయుడు, వాలంటరీ శివ తదితరులు పాల్గొన్నారు.

టైలరింగ్ విద్యార్థినిలకు సర్టిఫికెట్ల ప్రదానం

సురవరం కపిల్‌తో జిల్లా సీపీఐ నాయకులు

గద్వాల మార్చి 9, ప్రభాత వార్త: కంచుపాడు గ్రామంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సురవారం వెంకట్రామిరెడ్డి విజ్ఞాన కేంద్రంలో శ్రీరామనందతీర్థ రూరల్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో టైలరింగ్ విద్యార్థునిలకు సర్టిఫికెట్ల ప్రదానోత్సవం, ప్రముఖ మహిళలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆత్మీయ అతిధి నెల్లికంటి సత్యం ఎం ఎల్ సీ, జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు డాక్టర్ ఎన్. కిశోర్‌రెడ్డి, డి.ఈ.ఓ. విజయలక్ష్మి లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సిపిఐ నాయకులు సురవరం కపిల్, జిల్లా సిపిఐ నాయకులు ఆంజనేయులు, న్యాయవాది రమేష్, శ్రీరాములు, వెంకట రాములు, పాల్‌సుధాకర్, అడ్డాకుల నాగరార్జున్, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాలలో ముందుండాలి

ఓఎంఐఎఫ్ స్వచ్ఛంద సంస్థ జిల్లా కోఆర్డినేటర్ నారాయణ

మాట్లాడుతున్న మహిళలు

కోయిలకొండ మార్చి 9,ప్రభాతవార్త: సమాజంలో మహిళలు అన్ని రంగాలలో ముందుండాలని ఓఎంఐఎఫ్ స్వచ్ఛంద సంస్థ జిల్లా కోఆర్డినేటర్ నారాయణ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన కోయిలకొండలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మహిళలు సమానత్వం, స్వేచ్ఛ కోసం కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మహిళలు అధైర్య పడకుండా అన్ని రంగాలలో దూసుకుపోవాలన్నారు.మహిళాశక్తి అనంతమైనది అన్నారు. మహిళలపై అఘాయిత్యాలు,హింసకు వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మహిళలు చదువుతోపాటు సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మన భారత రాజ్యాంగంలో అందరికీ సమాన హక్కులు కల్పించబడ్డాయని ఆయన గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పానుగంటి నాగేష్, అంగన్వాడీ టీచర్ లక్ష్మి, కమిటీ లీడర్ వెంకటమ్మ,, ఓఎమ్ఐ ఎఫ్ కార్యకర్తలు నాగమణి, శారద, లాలమ్మ,సుమిత్ర,స్వాతి, టైలరింగ్ టీచర్‌లక్ష్మి గ్రామస్తులు పాల్గొన్నారు.

పెద్దమ్మ గుడి నిర్మాణానికి విరాళం అందించిన వాల్మీకులు

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న వాల్మీకులు

శ్రీరంగాపూర్, మార్చి 9 ప్రభాతవార్త: శ్రీరంగాపూర్ మండలంలోని వెంకటపురం గ్రామంలో పెద్దమ్మ గుడి నిర్మాణం జరుగుతున్న సందర్భంగా పెద్దమ్మ గుడి నిర్మాణం కోసం తమవంతుగా వెంకటపురం గ్రామ వాల్మీకులు ఆర్థిక సహాయం చేయడం జరిగింది. మాజీ సర్పంచ్ కృష్ణయ్య రూ. 50000/.. వీరస్వామి నాయుడు రూ.25000 మెంటపల్లి తిరుపతయ్య నాయుడు రూ. 20000,/ ఆర్థిక సహాయంతో పాటు గర్భగుడికి గ్రానైట్ మార్బుల్స్ బండలు ఇప్పించడం కోసం ముందుకు వచ్చారు. గుమ్మడం కృష్ణయ్య రూ.10,000/లు ఈ మొత్తం ఆర్థిక సహాయాన్ని గ్రామ పెద్దమ్మ గుడి మేనేజ్మెంట్ సభ్యులకు అందించడం జరిగింది.గ్రామ పెద్దలుమాట్లాడుతూ గ్రామంలో ఇంకా ఎవరైనా పెద్దమ్మ గుడి నిర్మాణం కోసం విరాళం అందించేవారు ఉంటే ముందుకు రావాలని కోరడం జరిగింది. విరాళం అందించిన వారికి వారి కుటుంబ సభ్యులకు పెద్దమ్మ తల్లి ఆశీస్సులు ఎప్పటికి ఉంటాయని గ్రామ పెద్దలు ప్రజలు అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, పెద్దలు, మాజీ సర్పంచ్ కృష్ణయ్య, మాజీ ఉప సర్పంచ్ ప్రభాకర్ గౌడ్, సురగౌని ఎల్లగౌడ్ ,వెంకటస్వామి, మెంటపల్లి తిరుపతియ్య, మెంటేపల్లి శ్రీనివాసులు,గంగారం వెంకటయ్య,వీరస్వామి నాయుడు,వార్డు మెంబర్ కుమ్మరి బాలరాజ్, ప్రవీణ్‌కుమార్ నాయుడు, గుమ్మడం కృష్ణయ్య, మండల రిపోర్టర్ మంటేపల్లి శంకర్ నాయుడు, కుమ్మరి నాగేంద్రం, సాకలిఎల్లయ్య, బడేసాబ్, మంగలి కిట్టు,కుమ్మరి రాముడు పాల్గొన్నారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు

679 ప్రాంతాల్లో చెత్త సేకరణ, వ్యర్థాల తొలగింపు

జిల్లాలో ఉత్సాహంగా కొనసాగుతున్న ప్రగతి ప్రణాళిక కార్యక్రమం

అడ్డాకులలో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమం

మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి9 ప్రభాతవార్త: ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ గ్రామీణ ఉపాధి శాఖ ద్వారా సోమవారం నాల్గవ రోజు కార్యక్రమాలను జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో, ప్రజల భాగస్వామ్యంతో పరిశుభ్రత, ఫైళ్ళ పరిష్కారం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధానంగా పరిశుభ్రత,పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వడం జరిగింది. గ్రామాల్లో పేరుకుపోయిన ఘన వ్యర్థాలను తొలగించడం, ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ మరియు సక్రమంగా నిర్వాహణ, అలాగే నేచర్ పార్కుల నిర్వహణ పనులను గుర్తించి చర్యలు తీసుకోవడం వంటి కార్యక్రమాలను అధికారులు స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో చేపట్టారు.జిల్లాలోని 16మండలాల్లో ఉన్న మొత్తం 423 గ్రామ పంచాయతీలలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమం భాగంగా జిల్లావ్యాప్తంగా 707 ప్రాంతాల్లో పేరుకుపోయిన ఘన వ్యర్థాలను గుర్తించగా,వాటిలో 679 ప్రాంతాలను శుభ్రపరిచారు. మొత్తం 3,174 కిలోల ఘన వ్యర్థాలను తొలగించారు. అలాగే 96 కిలోల ఈ-వ్యర్థాలను సేకరించగా, వాటిలో 84 కిలోలను సక్రమంగా వేరు చేసి డిస్పోస్ చేశారు.జిల్లాలోని 142 నేచర్ పార్కుల్లో మెయింటెన్స్ నిర్వహణ పనులను గుర్తించారు.అడ్డాకల్ మండలంలోని 17 గ్రామ పంచాయతీలలో 17 ప్రాంతాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను గుర్తించి అన్ని ప్రాంతాలను శుభ్రపరిచారు. మొత్తం 263 కిలోల ఘన వ్యర్థాలను తొలగించారు. అలాగే 21 కిలోల ఈ-వ్యర్థాలను సేకరించగా, వాటిలో 18 కిలోలను సక్రమంగా వేరుచేసి డిస్పోస్ చేశారు. నేచర్ పార్కుల్లో 16 నిర్వహణ పనులను గుర్తించారు.బాలానగర్ మండలంలోని 37 గ్రామ పంచాయతీలలో 64 ప్రాంతాల్లో వ్యర్థాలు గుర్తించగా, 63 ప్రాంతాలను శుభ్రపరిచారు. మొత్తం 117 కిలోల ఘన వ్యర్థాలను తొలగించారు. ఈ మండలంలో ఈ-వ్యర్థాల సేకరణ నమోదు కాలేదు. భూత్పూర్ మండలంలోని 19 గ్రామ పంచాయతీలలో 23 ప్రాంతాల్లో పేరుకుపోయిన వ్యర్థాలనుగుర్తించి అన్ని ప్రాంతాలనుశుభ్రపరిచారు. మొత్తం 245 కిలోల ఘన వ్యర్థాలను తొలగించారు. ఈ మండలంలో ఈ-వ్యర్థాల సేకరణ జరగలేదు. నేచర్ పార్కుల్లో 9 నిర్వహణ పనులను గుర్తించారు.

సీసీకుంట: మండలంలోని 18 గ్రామ పంచాయతీలలో 20 ప్రాంతాల్లో వ్యర్థాలను గుర్తించి అన్ని ప్రాంతాలను శుభ్రపరిచారు. మొత్తం 73 కిలోల ఘన వ్యర్థాలను తొలగించారు. అదనంగా 14 కిలోల ఈ-వ్యర్థాలను సేకరించి సక్రమంగా నిర్వాహణ చేశారు. నేచర్ పార్కుల్లో 18 నిర్వహణ పనులను గుర్తించారు.

దేవరకద్ర: మండలంలోని 18 గ్రామ పంచాయతీలలో 44 ప్రాంతాల్లో వ్యర్థాలను గుర్తించగా, 41 ప్రాంతాలను శుభ్రపరిచారు. మొత్తం 113 కిలోల ఘన వ్యర్థాలను తొలగించారు. ఈ మండలంలో ఈ-వ్యర్థాల సేకరణ జరగలేదు. నేచర్ పార్కుల్లో నిర్వహణ పనులు గుర్తించబడలేదు.

గండీడ్: మండలంలోని 27 గ్రామ పంచాయతీలలో 48 ప్రాంతాల్లో వ్యర్థాలను గుర్తించి అన్ని ప్రాంతాలను శుభ్రపరిచారు. మొత్తం 187 కిలోల ఘన వ్యర్థాలను తొలగించారు. ఈ మండలంలో ఈ-వ్యర్థాల సేకరణ జరగలేదు. నేచర్ పార్కుల్లో 10 నిర్వహణ పనులను గుర్తించారు.

హన్వాడ: మండలంలోని 35 గ్రామ పంచాయతీలలో 63 ప్రాంతాల్లో వ్యర్థాలను గుర్తించి అన్ని ప్రాంతాలను శుభ్రపరిచారు. మొత్తం 214 కిలోల ఘన వ్యర్థాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో 37 కిలోల ఈ-వ్యర్థాలను సేకరించగా,వాటిలో 29 కిలోలను సక్రమంగా నిర్వాహణ చేశారు. నేచర్ పార్కుల్లో 17 నిర్వహణ పనులను గుర్తించారు.

జడ్చర్ల: మండలంలోని 45 గ్రామ పంచాయతీలలో 76 ప్రాంతాల్లో వ్యర్థాలను గుర్తించగా, 73 ప్రాంతాలను శుభ్రపరిచారు. మొత్తం 205 కిలోల ఘన వ్యర్థాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో 4 కిలోల ఈ-వ్యర్థాలను సేకరించి సక్రమంగా నిర్వాహణ చేశారు. నేచర్ పార్కుల్లో 20 నిర్వహణ పనులను గుర్తించారు.

కోయిలకొండ: మండలంలోని 44 గ్రామ పంచాయతీలలో 28 ప్రాంతాల్లో వ్యర్థాలను గుర్తించి అన్ని ప్రాంతాలను శుభ్రపరిచారు. మొత్తం 198 కిలోల ఘన వ్యర్థాలను తొలగించారు. ఈ మండలంలో ఈ-వ్యర్థాల సేకరణజరగలేదు. నేచర్ పార్కుల్లో 14 నిర్వహణ పనులను గుర్తించారు.

కౌకుంట్ల: మండలంలోని 12 గ్రామ పంచాయతీలలో 30 ప్రాంతాల్లో వ్యర్థాలను గుర్తించి అన్ని ప్రాంతాలను శుభ్రపరిచారు. మొత్తం 98 కిలోల ఘన వ్యర్థాలను తొలగించారు.ఈ మండలంలో ఈ-వ్యర్థాల సేకరణ జరగలేదు. నేచర్ పార్కుల్లో12 నిర్వహణ పనులను గుర్తించారు.

మహబూబ్‌నగర్: మండలంలోని 24 గ్రామ పంచాయతీలలో 24 ప్రాంతాల్లో వ్యర్థాలను గుర్తించి అన్ని ప్రాంతాలను శుభ్రపరిచారు. మొత్తం 185 కిలోలఘన వ్యర్థాలను తొలగించారు. అదనంగా 3 కిలోల ఈ-వ్యర్థాలను సేకరించి సక్రమంగా నిర్వాహణ చేశారు. నేచర్ పార్కుల్లో 8 నిర్వహణ పనులను గుర్తించారు.

మిడ్జిల్ : మండలంలోని 24 గ్రామ పంచాయతీలలో 45 ప్రాంతాల్లో వ్యర్థాలను గుర్తించగా,36 ప్రాంతాలను శుభ్రపరిచారు.మొత్తం 68 కిలోల ఘన వ్యర్థాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో 3 కిలోల ఈ-వ్యర్థాలను సేకరించి నిర్వాహణ చేశారు. నేచర్ పార్కుల్లో నిర్వహణ పనులు గుర్తించబడలేదు.

మొహమ్మదాబాద్ : మండలంలోని 22గ్రామ పంచాయతీలలో 41 ప్రాంతాల్లో వ్యర్థాలను గుర్తించి అన్ని ప్రాంతాలను శుభ్రపరిచారు. మొత్తం 159 కిలోల ఘన వ్యర్థాలను తొలగించారు. ఈ మండలంలో ఈ-వ్యర్థాల సేకరణ జరగలేదు. అయితే నేచర్ పార్కుల్లో 12 నిర్వహణ పనులను గుర్తించారు.

ముసాపేట్: మండలంలోని 15 గ్రామ పంచాయతీలలో 22 ప్రాంతాల్లో వ్యర్థాలను గుర్తించి అన్ని ప్రాంతాలను శుభ్రపరిచారు. మొత్తం 124 కిలోల ఘన వ్యర్థాలను తొలగించారు. ఈ మండలంలో ఈ-వ్యర్థాల సేకరణ జరగలేదు. నేచర్ పార్కుల్లో 8 నిర్వహణ పనులను గుర్తించారు.

నవాబ్‌పేట్ : మండలంలోని 42 గ్రామ పంచాయతీలలో 87 ప్రాంతాల్లో వ్యర్థాలను గుర్తించగా, 86 ప్రాంతాలను శుభ్రపరిచారు. మొత్తం 119 కిలోల ఘన వ్యర్థాలనుతొలగించారు. ఈ కార్యక్రమంలో 9కిలోల ఈ-వ్యర్థాలను సేకరించగా, వాటిలో 8 కిలోలను సక్రమంగా నిర్వాహణ చేశారు. నేచర్ పార్కుల్లో 7 నిర్వహణ పనులను గుర్తించారు.

రాజాపూర్: మండలంలోని 24 గ్రామ పంచాయతీలలో 24 ప్రాంతాల్లో వ్యర్థాలను గుర్తించి అన్ని ప్రాంతాలను శుభ్రపరిచారు. మొత్తం 385 కిలోలఘన వ్యర్థాలను తొలగించారు. అదనంగా 3 కిలోల ఈ-వ్యర్థాలను సేకరించి సక్రమంగా నిర్వాహణ చేశారు. నేచర్ పార్కుల్లో 21 నిర్వహణ పనులను గుర్తించారు.

మహిళపై లైంగిక వేధింపులు

నిందితుడిపై కేసు నమోదు

దామరగిద్ద, మార్చి9 ప్రభాతవార్త: దామరగిద్ద మండలం కంసాన్పల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ ఫిర్యాదు మేరకు లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదుచేసినట్లు దామరగిద్ద ఎస్సైరాజు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. కంసాన్పల్లి గ్రామానికి చెందిన బొగ్గుల కనకప్ప అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన మహిళను గత రెండు సంవత్సరాలుగా వెంటపడుతూ వేధింపులకు గురిచేస్తున్నాడు. ఎక్కడ కనిపించినా అసభ్యంగా మాట్లాడడం, లైంగికంగా వేధించడం ద్వారా ఆమెను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ క్రమంలో 08.03.2026 ఉదయం సుమారు 7 గంటల సమయంలో మహిళ చెత్త వేయడానికి గ్రామ శివారులోని దొడ్డి వద్దకు వెళ్లిన సమయంలో అక్కడికి వచ్చినకనకప్ప ఆమె చేతిని పట్టుకుని అసభ్యంగా ప్రవర్తిస్తూ చీర పట్టుకుని లాగినట్లు బాధితురాలు తెలిపింది. భయంతో అక్కడి నుంచి తప్పించుకుని ఇంటికి వెళ్లి జరిగిన విషయాన్ని భర్తకు చెప్పినట్లు పేర్కొన్నారు.అనంతరంభర్త ప్రశ్నించగా కూడా నిందితుడు బెదిరింపులకు పాల్పడినట్లు తెలిపారు. ఈ విషయంపై సమాచారం అందుకున్న దామరగిద్ద ఎస్సై రాజు బాధితురాలి ఇంటికి వెళ్లి ఫిర్యాదు స్వీకరించి, నిందితుడిపై లైంగిక వేధింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.

నవాబ్‌పేట్ పోలీస్ స్టేషన్ కేసులో

నిందితుడికి 2 సంవత్సరాల జైలు శిక్ష

నవాబ్‌పేట, మార్చి 9 ప్రభాతవార్త: మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన దోపిడీ కేసులో నిందితుడికి న్యాయస్థానం శిక్ష విధించింది. ఈ కేసుకు సంబంధించి 09.03.2026తేదీన మహబూబ్‌నగర్ స్పెషల్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి మోహద్ మునవర్ హుస్సేన్ తీర్పు వెలువరించారు.వివరాలలోకి వెళితే, 07.12.2024 తేదీన నవాబ్‌పేట్ మండలం కాకర్లపహాడ్ గ్రామ పరిధిలో నిందితుడు పుంటికూర కర్ణాకర్‌రెడ్డి కుచూర్ గ్రామం,నవాబ్‌పేట్ మండలం, బాధితురాలిని ఉడందాపూర్ గ్రామానికి వదిలేస్తానని చెప్పి తన మోటార్ సైకిల్‌పై ఎక్కించుకున్నాడు. అనంతరం కాకాజాల గ్రామ అటవీ ప్రాంతానికితీసుకెళ్లి కత్తితో బెదిరించి, బీర్ బాటిల్‌తో తలపై దాడి చేసి గాయపరిచి, ఆమె వద్ద ఉన్న సుమారు 4 గ్రాముల బంగారు నల్లపుసల దండ, సుమారు 20 తులాల వెండి కాళ్ల గొలుసులు (మొత్తం విలువ సుమారు రూ.20,000) దోచుకొని మోటార్ సైకిల్‌పై పారిపోయాడు.ఈ ఘటనపై నవాబ్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 263/2024 కింద కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణ అనంతరం నిందితుడిపై చార్జ్‌షీట్ దాఖలు చేయగా,మహబూబ్‌నగర్ స్పెషల్ మొబైల్ కోర్టులో విచారణకు వచ్చింది.కేసులో సమర్పించిన సాక్ష్యాధారాలు, సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడిని దోషిగా తేల్చి బిఎన్ఎస్ సెక్షన్ 309(6) ప్రకారం 2 సంవత్సరాల సాధారణ కారాగారశిక్షతో పాటు రూ.2,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది.ఈ కేసు దర్యాప్తును మహబూబ్‌నగర్ రూరల్ సర్కిల్ సీఐ గాంధీ నాయక్ నిర్వహించారు. కోర్టులో ప్రభుత్వ తరఫున ఎపిపి ఎస్ఎన్ విశ్వ రేఖ వాదనలు వినిపించారు. ప్రస్తుతంనవాబ్‌పేట్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్ఓగా విక్రమ్ ఎస్ఐ విధులు నిర్వహిస్తున్నారు. కేసు డాక్యుమెంటేషన్ పనులను నవాబ్‌పేట్ పోలీస్ స్టేషన్‌కు చెందిన సిడిఓ ఎం.విజయ్ కుమార్, పీసీ 1095 నిర్వహించారు.ఈ తీర్పుతో నిందితుడికి తగిన శిక్ష విధించబడిందని పోలీసులు తెలిపారు.ఈ కేసు విచారణ నందు పనిచేసిన న్యాయ శాఖా అధికారులను, పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ డి.జానకి అభినందించారు.

గట్టు బ్లాక్‌ను అభివృద్ధి పరచడమే ధ్యేయం

(మొదటి పేజీ తరువాయి)

అభిప్రాయపడ్డారు. సెమినార్‌లో పాల్గొన్న ఆరురాష్ట్రాల బృందాల నుంచి విద్యారంగంలో ఐదు రాష్ట్రాల ప్రతినిధులు ఉత్తమ ప్రదర్శన కనబరచగా అందులో తెలంగాణ రాష్ట్రం, జోగులాంబ గద్వాల జిల్లా కు చెందిన గట్టు బ్లాక్ కూడా ఉండడం గర్వకారణమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నీతి అయోగ్ అదనపు కార్యదర్శి రోహిత్ కుమార్, డిప్యూటీ సెక్రెటరీగౌరవ్‌కటియార్, ఆంధ్రప్రదేశ్ ప్లానింగ్ డిపార్ట్మెంట్ అనంత్‌శేఖర్, వివిధ రాష్ట్రాల కలెక్టర్లు, ఉన్నతాధి కారులు, తదితరులు పాల్గొన్నారు.

135 పాఠశాలల్లో 6000 మందికి పైగా విద్యార్థులు మోటివేషనల్ సెషన్ వీక్షణ

(మొదటి పేజీ తరువాయి)

గ్యాప్ రోజులను సద్వినియోగంచేసుకుంటే విద్యార్థులు మంచి ఫలితాలు సాధించగలరని అన్నారు ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు సరైన నిద్ర తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ప్రశాంతంగా పరీక్షలకు హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో నిర్వహించిన ప్యానెల్ డిస్కషన్‌లో నారాయణపేట జిల్లా నుండి పెద్దకడుమూరు జడ్పీ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి పాల్గొని జిల్లాలో 10వతరగతి విద్యార్థుల కోసం చేపడుతున్న ప్రత్యేక అకాడమిక్ కార్యక్రమాలను వివరించారు.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో నూతన ఉత్సాహం పెరిగి పరీక్షలకు మరింత ధైర్యంగా సిద్ధమవుతారని జిల్లా విద్యాశాఖాధికారి డా. గోవిందరాజు ఆశాభావం వ్యక్తం చేశారు.

సామ్రాజ్యవాద దాడులను ప్రపంచ ప్రజలు ప్రతిఘటించాలి

◆ ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్

అమరచింత మార్చి 9, ప్రభాతవార్త: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఇజ్రాయిల్ దేశ అధ్యక్షులు జియోనిస్ట్ ఇరాన్ దేశం పై దాడిని ప్రపంచ ప్రజలు ప్రతిఘటించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి, కుతుబ్ కోరారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం అమరచింత మండల కేంద్రంలోని ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో అమెరికా ఇజ్రాయిల్ దేశాలు ఇరాన్‌పై దాడిని వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆర్థిక ఆధిపత్యాన్ని పెంచుకునేందుకు ఇరాన్ పై యుద్ధం ప్రకటించి కార్మికులు రైతులు పేదప్రజలు లక్షలాదిమంది అమాయక ప్రాణాలు కోల్పోవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా సామ్రాజ్య వాద యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా ప్రపంచంలోని కార్మిక వర్గం సామ్రాజ్యవాద శక్తులు శాంతిని నెలకొల్పడానికి ఐక్యంగా తమ వాదనను వినిపించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో అన్సర్, కాజా,గౌస్, వినోద్, నాగరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

అమరచింత మార్చి9, ప్రభాతవార్త: అమరచింత మండలం సింగంపేట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా, విద్యాశాఖ అధికారులుగా బాధ్యతలు చేపట్టి ప్రతిభ కనబర్చారు.ఈ కార్యక్రమంలో అభిరామ్ డీఈవోగా, జస్వంత్ ఎంఈఓగా, అవంతిక ప్రధానోపాధ్యాయురాలిగా బాధ్యతలు నిర్వర్తించారు. అలాగే షారోన్ స్పందన, అవంతిక, ఈశ్వర్, జస్వంత్, నిఖిల్, వెంకటేష్, విజ్ఞాన్, శ్వేత, ప్రీతి, మానస, త్రివేణి విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి అందరినీ ఆకట్టుకున్నారు.కార్యక్రమం అనంతరం విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు మహేశ్వరమ్మ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కళావతి, సంధ్య, శోభ, గ్రామ సర్పంచ్ సలోమి మన్యం, విద్యా కమిటీ చైర్మన్ శిరీష, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నూతన తహసీల్దార్‌ను సన్మానించిన సర్పంచులు

వీపనగండ్ల మార్చి9, ప్రభాతవార్త: నూతన తాసిల్దారుగా పదవి చేపట్టిన జి శివ కుమార్ ను బొల్లారం సర్పంచ్ సుదర్శన్ రెడ్డి తూముకుంట తండా గోపాల్ నాయక్ సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ నూతన అధికారి గా బాధ్యతలు తీసుకున్న తాసిల్దార్ శివకుమార్ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారి సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలనిఈ సందర్భంగా ఆయనకు సూచించారు. వారితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు రవీందర్ రెడ్డి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ శివకుమార్ మాట్లాడుతూ ప్రజలకు ఎప్పుడూఎల్లవేళలా ఎలాంటి సమస్యలుఉన్నా రెవెన్యూ పరంగా పరిష్కారం చేయడానికి అధికారులుగా మాకు బాధ్యత ఉందని దాన్ని ఎప్పుడూ కూడా విస్మరించమని ఆయన తెలిపారు.

కల్వకుర్తిలో ఉత్సాహంగా 2కే రన్

(మొదటి పేజీ తరువాయి)

మౌలిక వసతుల కల్పన వంటివి) దృష్టి సారిస్తూ పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని వివరించారు. "మనం ఎంత సంపాదించినా ఆరోగ్యం సరిగా లేకపోతే ప్రయోజనం లేదని. అందుకే ఆరోగ్యమే మహాభాగ్యమనే నినాదంతో నేడు 2కే రన్ నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలందరూ తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి, వ్యాయామాన్ని అలవాటు చేసుకోవాలని, "ప్రభుత్వ పిలుపు మేరకు చేపట్టిన ఈ 2కే రన్ కు పట్టణ ప్రజల నుండి అద్భుతమైన స్పందన వచ్చిందన్నారు. విద్యార్థులు, యువకులు పెద్దలు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేశారు. రాబోయే 99 రోజులు పట్టణంలోని పారిశుధ్యం, మౌలిక వసతుల మెరుగుదలే లక్ష్యంగా పని చేస్తామని తెలిపారు. ఆరోగ్యం పట్ల అవగాహన కల్పిస్తూ మున్సిపాలిటీ చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమాన్ని పట్టణ ప్రజలు అభినందించారు.